ఎర్రగడ్డ రైతుబజార్‌లో సందడి

పండుగ నేపథ్యంలో కిటకిటలాడిన జనం

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో ఎర్రగడ్డ రైతు బజార్‌లో ప్రజలు కిటకిటలాడారు. కూరగాయలు, పూలు, పూజసామగ్రి కొనుగోలు చేశారు. రైతుబజార్, చుట్టుపక్కల ప్రాంతాల్లో పూల వ్యాపారాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా వినాయక చవితికి ప్రత్యేకంగా ఉపయోగించే ఆకుకూరలలో ఒకటైన తుమ్మికూర కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు.

వినాయక విగ్రహాలకు డిమాండ్

ధూల్‌పేట తర్వాత నగరంలో వినాయక విగ్రహాలు అత్యధికంగా అమ్ముడు పోయేది ఎర్రగడ్డ మార్కెట్‌లోనే. ఎర్రగడ్డ, సంజీవరెడ్డినగర్, సనత్‌నగర్, మోతీనగర్, బోరబండ తదితర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడే అధికంగా విగ్రహాలు కొనుగోలు చేస్తారు. రైతుబజార్ ఎదురుగా ఉన్న రోడ్డుపై సుమారు కిలోమీటర్ మేర పెద్ద, చిన్న సైజు వినాయకుల అమ్మకాలు కొనసాగాయి. ఒక ఫీట్ నుంచి 15 ఫీట్ల వరకు మట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు అత్యధిక డిమాండ్ ఉంది. గతేడాది కంటే 25 శాతం విగ్రహాల ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఐదు ఫీట్ల వినాయక విగ్రహం గతేడాది రూ.7-8 వేలు పలుకగా, ప్రస్తుతం రూ.10-12 వేలు పలుకుతోంది. మట్టి విగ్రహాల ధరలు కూడా పెరిగాయి.


పూలు

తుమ్మికూర కొనుగోలు



రైతుబజార్‌కు వినియోగదారులు తాకిడి పెరిగింది. మామూలు రోజుల కన్నా కూరగాయలు, తుమ్మి కూరను కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది వినియోగదారులు వచ్చారు.

శాంతమ్మ, తూప్రాన్ గ్రామ రైతు

అమాంతం పెరిగిన పూల ధరలు



పూల ధరలు అమాంతం పెరిగాయి. మామూలు రోజుల్లో ఉండే ధర కన్నా పూల ధరలు రెట్టింపు అయ్యాయి. గణేశ్ నవరాత్రులు ప్రారంభమైతే వ్యాపారులు పూల ధర మరింత పెంచుతారేమో.

సి.నాగేశ్వరరావు, వినియోదారుడు


ఆకుకూరల కొనుగోలు

సందడిగా ఖైరతాబాద్ గణేశ్ ఆగమన్

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హమారా ఖైరతాబాద్‌కా రాజా ఆగయా.. ఉస్‌కా స్థాన్‌పే ఖడా రహా.. అంటూ భారీ గణేశ్‌ను ఖైరతాబాద్‌కు ఆహ్వానిస్తూ జరిగిన ఆగమన్ సోమవారం వైభవంగా జరిగింది. యువత నృత్యాలు చేశారు. ఇందులో ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. దాదాపు అరగంటకు పైగా కాల్చిన బాణాసంచా వెలుగులు చూపరులను ఆకట్టుకున్నాయి.


చేనేత కండువా, పట్టు వస్త్రాలను చూపుతున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

చేనేత కండువా, పట్టు వస్త్రాలు సిద్ధం

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ విశ్వశాంతి మహాశక్తి గణపతి కోసం ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 75 అడుగుల భారీ కండువా, జంజం, పట్టు వస్త్రాలను సిద్ధం చేశారు. పండుగ రోజు భారీ ఊరేగింపుగా వీటిని గణపతి వద్దకు తీసుకువచ్చి ప్రముఖుల చేతుల మీదుగా గణపతితో పాటు ఆయన వెంట ఉన్న దేవతా విగ్రహాలకు సమర్పిస్తామని సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం కొండయ్య, అధ్యక్షుడు కడారి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఏలె స్వామి సోమవారం తెలిపారు.

ఖైరతాబాద్ గణపతి వద్ద భారీ బందోబస్తు


సంజయ్ కుమార్

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ లక్ష నుంచి రెండు లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ గణపతి వద్దకు వస్తుంటారు. ఇక వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 3 నుంచి 5 లక్షల వరకు ఉంటుంది. ఈసారి ఇంతకు మించి భక్తులు వస్తారనే అంచనాల నేపథ్యంలో ఖైరతాబాద్ గణపతి వద్ద పోలీసులు ఎప్పుడూ లేనంత బందోబస్తును నిర్వహించనున్నారు. ఈ విషయమై సైఫాబాద్ ఏసీపీ ఆర్. సంజయ్‌కుమార్ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. ఇక్కడ ఆరుగురు డీఎస్పీలు, 23 మంది ఇన్‌స్పెక్టర్లు, 52 మంది ఎస్‌ఐలు, 150 మంది కానిస్టేబుళ్లు, 50 మంది మహిళా కానిస్టేబుళ్లు, 22 ప్లటూన్ల సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ తరచుగా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తాయని, 60 సీసీ కెమెరాల ద్వారా భక్తుల భద్రతను సమీక్షిస్తామని తెలిపారు. అన్ని మార్గాల్లో డోర్ ఫ్రేం, హ్యాండ్ మెటల్ డిటెక్టర్లతో భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకే దర్శనానికి అనుమతి ఉంటుందన్నారు. భక్తులు విలువైన ఆభరణాలను, వస్తువులను తీసుకొని రాకూడదని తెలిపారు. ఉత్సవ కమిటీల ప్రతినిధులు అతిథులు, వీఐపీలను సాధ్యమైనంత వరకు ఉదయం నుంచి మధ్యాహ్నంలోపే వచ్చేలా ఆహ్వానించాలని కోరారు.

100 మంది ప్రైవేట్ సెక్యూరిటీ..

ఉత్సవ కమిటీ తరఫున 100 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని తమకు అందించాలని పోలీసులు కోరారు. తమ సిబ్బందికి అదనంగా వారి సేవలను 3 షిఫ్టుల్లో వాడుకుంటామని, మొత్తం 100 మందిని తమకు అప్పగిస్తే వారికి పోలీసు అధికారులు అవసరం మేరకు వినియోగించుకుంటారని ఏసీపీ సంజయ్ కుమార్ తెలిపారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు


సీపీ ఆనంద్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

భారీ గణపతి తొలి రోజు పూజకు గవర్నర్, ముఖ్యమంత్రి

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ముస్తాబైన ప్రతిష్ఠాత్మక వినాయకుడికి పండగ రోజున తొలి పూజలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించనున్నారు. గవర్నర్ సైతం ఈ పూజలకు హాజరుకానున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈమేరకు రెండు కమిటీల ప్రతినిధులు సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీల అధ్యక్షుడు దానం నాగేందర్ నేతృత్వంలో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ప్రముఖ వేదపండితులు రంగరాజస్వామి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఆశీర్వాదం ఇవ్వగా కమిటీ ప్రతినిధులు ఆహ్వానపత్రం అందజేశారు. అలాగే, సీపీ సీవీ ఆనంద్, ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులకు ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీల ప్రతినిధులు దానం నాగేందర్, సింగరి రాజ్‌కుమార్, వీణా మాధురి, రాంరెడ్డి, బాక్సర్ అశోక్, మహేష్ యాదవ్, రాజు పాల్గొన్నారు.

‘మహా’ మట్టి గణపతులకు అనూహ్య స్పందన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేస్తున్న మట్టి గణపతులకు అనూహ్య స్పందన వచ్చింది. నగరంలోని 34 కేంద్రాల్లో హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ అధికారులు పంపిణీ చేస్తున్నారు. ఆది, సోమవారాల్లో దాదాపు 90వేల వరకు మట్టి గణపతులను పంపిణీ చేసినట్లు తెలిసింది. మంగళవారం మిగతా మట్టి గణపతులను పంపిణీ చేయనున్నారు. మూడు రోజుల్లో లక్ష మట్టి గణపతులను నగరవాసులకు అందించడానికి అన్నీ రకాల చర్యలు చేపట్టామని, మొబైల్ వాహనాల ద్వారా పలు కాలనీలు, రద్దీ ప్రాంతాల వారీగా కూడా ఉచిత పంపిణీ ప్రక్రియ సాగుతుందని హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకువచ్చాయని, ‘మట్టి గణపతి మహా గణపతి’ అని నగరవాసుల్లో విస్తృతంగా ప్రచారం, అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన మట్టి గణేశ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎస్‌ఈ అప్పారావు, ఈఈ శంకర్, డీఈలు గణేశ్, విద్యాసాగర్, రాజమోహన్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.


మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఎస్‌ఈ అప్పారావు

మట్టి గణపతులనే పూజించాలి : విజయారెడ్డి

ఖైరతాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని, హుస్సేన్ సాగర్‌ను పది తరాలపాటు కాపాడుకోవాలంటే అందరూ మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించాలని కార్పొరేటర్ విజయారెడ్డి సూచించారు. సోమవారం ఖైరతాబాద్‌లో ఆమె జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.


మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న విజయారెడ్డి


బీజేపీ కార్యాలయంలో గణేశ్ విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆ పార్టీ సెంట్రల్ జిల్లా మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, నాయకులు మురళీకృష్ణ, హైమావతి, దుర్గాప్రసాద్ తదితరులు

- పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి


ముస్లిం మత పెద్దల నుంచి గణేశ్ విగ్రహాన్ని అందుకుంటున్న తేజు విజయ కుమారి

ముస్లిం మత పెద్దలకు సన్మానం

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ జాతీయ రహదారి పక్కన ఉన్న గణపతి విగ్రహాల విక్రయాలకు సహకరిస్తున్న స్థానిక మజీద్ ఎ గుల్షన్ బాగ్ ప్రతినిధులను, ముస్లిం మత పెద్దలను వెస్ట్ జోన్ పీస్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. పీస్, వెల్ఫేర్ కమిటీ వెస్ట్ జోన్ అధ్యక్షురాలు తేజు విజయ కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎస్‌ఆర్ నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, బోరబండ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎస్‌ఆర్ నగర్ ఎస్సై సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. మాట్లాడుతూ మజీద్ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో పీస్ కమిటీ సమన్వయకర్త మహ్మద్ సలీం జావెద్, పీస్ వెల్ఫేర్ కమిటీ ప్రధాన కార్యదర్శి కృష్ణ శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ బోగి బాలక్ దాస్, సభ్యులు నజీర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


పవర్ బోరు పనులను ప్రారంభిస్తున్న దీపక్‌రెడ్డి

పవర్ బోరు పనులు ప్రారంభం

బోరబండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హెచ్.ఎఫ్.నగర్ సాయిబాబా ఆలయం వద్ద కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నిధులతో ఏర్పాటు చేయనున్న పవర్ బోరు పనులను బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు టి.లక్ష్మణ్, సీనియర్ నాయకులు కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారాయణ, రామ్‌ధారి బాబు, చింటు, లక్కి మహేష్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 19 ఫిర్యాదులు అందాయి. అనంతరం అధికారులతో జడ్సీ సమావేశం నిర్వహించారు. అలాగే, వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్షించారు. గణేష్ పండుగకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జడ్సీ అపూర్వ్ చౌహాన్ సూచించారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాగంటి సునీత

బంజారాహిల్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని, ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. నవోదయకాలనీలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ బూత్ స్థాయి సమావేశం సోమవారం జరిగింది. అనంతరం పలు పార్టీలకు చెందిన మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజరూపాన్ని ప్రజలకు తెలియచేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని గుర్తు చేశారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నిరంతరం శ్రమించారని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ సీటును నిలుపుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని అన్నారు. బీఆర్‌ఎస్ గెలిస్తేనే మాగంటికి సరైన నివాళి అర్పించినట్టు అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ దేదీప్యరావు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మయ్యకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

బంజారాహిల్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సంగీత దర్శకుడు, ఆరోగ్య డైట్ ఫౌండర్ హూడి మహాలక్ష్మయ్యకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. కరోనా టైమ్‌లో ఈ వైరస్ వ్యాప్తి, జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా పాటలు రాసి కంపోజ్ చేసినందుకుగాను ఆయనకు అవకాశం లభించింది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా ప్రతినిధి బింగి నరేందర్ గౌడ్ మాట్లాడారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 170 దేశాల్లో ఏటా జనవరిలో ఈ పుస్తకాన్ని ప్రచురిస్తుందని తెలిపారు. ఆరోగ్య డైట్ ద్వారా మహాలక్ష్మయ్య దాదాపు 96 వేల మందికి షుగర్, పీసీఓడీ వంటి వివిధ రకాల అనారోగ్యాల నుంచి ఉపశమనం కలిగించారన్నారు. మహాలక్ష్మయ్య మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం గర్వంగా ఉందని, దీనిని బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు.


ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న మహాలక్ష్మయ్య


సెలూన్‌ను ప్రారంభిస్తున్న జబర్దస్త్ వర్ష

అందంతో ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపు

బంజారాహిల్స్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అందంతో ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జబర్దస్త్ వర్ష అన్నారు. కొండాపూర్ రాఘవేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన మానియా ది సెలూన్ 79వ ఫ్రాంచైజీని ఆమె సోమవారం కో-ఫౌండర్ ఉదయ్ కుమార్ కొనేరు, ఫ్రాంచైజీ భాగస్వామి గౌతమి సూర్య శ్రీపతి, నరేన్ గ్రూప్ చైర్మన్ నరేంద్రనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్ష మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో ఖరీదైన బ్యూటీ సేవలు ఇప్పుడు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. గౌతమి సూర్య శ్రీపతి మాట్లాడుతూ “మానియా సెలూన్‌లో గ్రూమింగ్, హెయిర్‌కట్, కలరింగ్, హెయిర్ ట్రీట్‌మెంట్, హెయిర్‌కేర్, స్కిన్‌కేర్, బాడీ కేర్, మేకప్ వంటి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ఆధునిక మౌలిక సదుపాయాలతో ఈ సెలూన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయ్ కుమార్ కొనేరు, పి.వి.శ్రీనివాస్ మాట్లాడుతూ “త్వరలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో మానియా బ్రాండ్‌ను మరింత విస్తరించబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు పీవీ శ్రీనివాస్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 134ను రద్దు చేయాలి

పంజాగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని వైద్య కళాశాలలు, ప్రధాన ఆస్పత్రుల్లో బహిరంగ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాతనే డైటీషియన్, న్యూట్రీషనిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని పలువురు డైటీషియన్, న్యూట్రీషనిస్టులు, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న జీవో 134ను రద్దు చేయాలని, సర్టిఫికెట్ కోర్సు చేసిన వారికి ఇన్ సర్వీస్ కోటాలో డైటీషియన్లుగా పదోన్నతి కల్పించవద్దని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ జానకి శ్రీనాథ్, సుజాత స్టీఫెన్, డాక్టర్ బి.జానకి, డాక్టర్ నస్రీన్, డాక్టర్ వాణిశ్రీ, శాంతకుమారి, అరుణ్ కుమార్, తదితరులు మాట్లాడారు. ఇన్ సర్వీస్ కోటా పేరుతో అర్హత లేని వారిని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రధాన ఆస్పత్రుల్లో డైటీషియన్, న్యూట్రీషనిస్టులుగా నియమిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ ఇచ్చి నేరుగా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో పలువురు నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ బకాయిలు చెల్లించాలి

పంజాగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ డీలర్లు ఐదు నెలలగా కమీషన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాల భవన్‌లో రేషన్ డీలర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 17,200 మంది రేషన్ డీలర్లు ఉన్నారని, వారికి ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్ రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ అధికారి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.ఎస్.రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పంజాగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నాంపల్లిలోని లలిత కళాతోరణంలో నిర్వహించనున్న పాత పెన్షన్ సాధన పోరాట సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా సంయుక్త కార్యదర్శి డాక్టర్ కె.విద్యా సాగర్, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథలకు చేయూతనందించాలి

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనాథలకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి అన్నారు. సోమవారం సారథి నగర్‌లోని ఆదర్శ ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ అనాథాశ్రమంలో పిల్లలకు రెయిన్ కోట్లు, దుప్పట్లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమలేష్, కిరణ్, మేరాజ్, రాజశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

వేగంగా వచ్చి ఆగిన బైక్ ఢీ

యూసుఫ్‌గూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వెనక నుంచి వేగంగా వచ్చి ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురి కాలనీకి చెందిన గోపీ ఇందిరానగర్ గ్రీన్ బావర్చి రెస్టారెంట్ సమీపంలో ద్విచక్ర వాహనం (టిఎస్09ఎఫ్‌వై 1796) నిలిపాడు. వెనక నుంచి వేగంగా వచ్చిన వాహనం(టిఎస్13ఈఆర్ 9261) ఢీకొట్టింది. వాహనం దెబ్బతినడంతో గోపీ సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



శ్రీ జైన్ స్వేతాంబర్ తేరాపంత్ 8 రోజుల ఉపవాస దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్, జంపన ప్రతాప్

శ్రీ జైన్ స్వేతాంబర్ తేరాపంత్ దీక్ష ప్రారంభం

బోయినపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీ జైన్ స్వేతాంబర్ తేరాపంత్ ఆధ్వర్యంలో బోయినపల్లి రాజరాజేశ్వరీ గార్డెన్స్‌లో 8 రోజుల ఉపవాస దీక్షలు, శాంతి సందేశం సభ సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్‌లు పాల్గొని జైన్ సాధ్వీల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా తెరాపంత్ సభ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ ధరకు స్థలం కేటాయిస్తే తెరాపంత్ భవనం నిర్మిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సాధ్వి డాక్టర్ గవేష్ణ శ్రీజి మేరు ప్రభజీ, మయాంక్ ప్రభ, దక్షి ప్రభ, హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ బంటీయా, సంకి రవీందర్, అధ్యక్షులు సునీల్ సంచేటి, హేమంత్ సంచేటి, ముకేశ్ చౌరసియా, బాబూలాల్ బేద పాల్గొన్నారు.



పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులను సత్కరిస్తున్న సహచర ఉద్యోగులు

ఆత్మీయ సన్మానం

చిలకలగూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే, సికింద్రాబాద్ అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న సీనియర్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, క్యాషియర్ వై.రాఘవ రావు, బిక్కీ రాంబాబులకు లేఖాభవన్‌లో సోమవారం సహచర ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత అనుభూతులు, అనుభవాలు గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

చెట్ల కొమ్మల తొలగింపు

తిరుమలగిరి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్ నుంచి రిసాలబజార్ వరకు విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా మారిన చెట్ల కొమ్మలను సోమవారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసుల సహకారంతో హైడ్రా సిబ్బంది తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఆదిత్య బ్యాంక్ కాలనీ వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ అధికారులను కోరారు. బీజేపీ నాయకుడు జగన్‌మోహన్ చారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవీ బాల్‌రాజ్ పనులను పరిశీలించారు.



స్కూల్ యాజమాన్యానికి చెక్కు అందజేస్తున్న వాసుదేవరావు

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

చిలకలగూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న సిద్ధేశ్వర్ పాటిల్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్కూల్ ఫీజులు చెల్లించటం కష్టమైన విషయం తెలుసుకున్న రైల్వే బ్రాహ్మణ సేవాసమాఖ్య బెంగుళూరుకు చెందిన సుజాతమ్మ రూ.17200 అందించారు. దీనిని సోమవారం సమాఖ్య ప్రతినిధి దుగ్గిరాల వాసుదేవరావు స్కూల్ యాజమాన్యానికి అందజేశారు.

నివాళులు

బన్సీలాల్‌పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.నైనేష్ శ్రీకాంత్ తండ్రి నరసింహాచారి ఆకస్మిక మృతి విషయం తెలుసుకున్న బీజేపీ యువ నాయకుడు మర్రి పురూరవరెడ్డి సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



- పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి

గాంధీ ఆస్పత్రిలో రోగి అదృశ్యం



అతుల్ చంద్ర మహాతో

బౌద్ధనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా దోమాడగు బొంతపల్లికి చెందిన అతుల్ చంద్ర మహాతో(46) మానసికంగా బాధపడుతుండటంతో అతడి భార్య హెలియాదేవీ వారం రోజుల క్రితం చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించింది. 24వ తేదీన భార్య బయటకు వచ్చినప్పుడు అతడు ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లాడు. అతడి కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేకపోవటంతో భార్య తన భర్త కనిపించటం లేదని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరిన ఉప్పల్ యువత

ఉప్పల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అన్ని రంగాలలో భారత్ బలపడుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మార్నేని ఫణీందర్ ఆధ్వర్యంలో శాంతి నగర్, సత్యానగర్, గాంధీ నగర్‌లకు చెదిన పలువురు యువకులు బీజేపీలో చేరిన సందర్భంగా ఆయన పార్టీ కండువాతో వారికి స్వాగతం పలికారు. మొగిలిపాక అరుణ్, అనబోయిన రాజేందర్, శనిగరం అభిరాం, పుట్టల రవితేజ, సాయి, నాగరాజ్ తదితరులు 54 మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, తీగ విఠల్ రావు, భవిష్ ప్రసాద్, జూలూరి శ్రీధర్ గుప్తా, దువ్వల రమేష్, అంజిరెడ్డి, ఆడెపు రమేష్, వెంకట్, నవీన్, జైరాం, నిశాంత్, ఉదయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండి కార్యాలయంలో కార్పొరేటర్ సామల హేమతో కలిసి మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు



బౌద్ధనగర్ వార్డు కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ తదితరులు

మట్టి గణపతిని పూజిద్దాం..
పర్యావరణాన్ని కాపాడుదాం

ఉచితంగా ప్రతిమల పంపిణీ

మట్టి గణపతే మహా గణపతి అని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని పలువురు సూచిస్తున్నారు. సోమవారం బౌద్ధనగర్, రాంగోపాల్‌పేట్, మారేడ్‌పల్లి, రెజిమెంటల్‌బజార్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేశారు.

బౌద్ధనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్, స్థానిక కార్పొరేటర్ సామల హేమలు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవటానికి మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కందిశైలజ, లింగాని ప్రసన్నలక్ష్మీ, నాయకులు శేఖర్, సునీల్‌ముదిరాజ్, మేడిశెట్టి బాలాజీ, శైలేందర్, రవి తదితరులు పాల్గొన్నారు. బౌద్ధనగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాలులో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మల్లికార్జున్, నాయకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్‌లో..



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న మల్లికార్జున్ తదితరులు

మట్టి గణపతులను పూజిద్దాం.. కాలుష్యాన్ని రక్షిద్దామని కాంగ్రెస్ పార్టీ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు దండుగుల మల్లికార్జున్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని కొత్త యల్లయ్య ఉన్నత పాఠశాలలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కటారి మహేష్‌కుమార్ యాదవ్‌తో కలిసి విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజించడం అంటే ప్రకృతిని పూజించడమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు నాగరాజు, నాయకులు టంక్ శ్రీనివాస్, ఓరం నవీన్, రఘు యాదవ్, యాదగిరి, హరి, నోమన్, రఘు ముదిరాజ్, రవి యాదవ్, విజయ్, సతీష్, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు తరలుతున్న గణనాథులు



వారాసిగూడలో మండపానికి తరలుతున్న విఠల్ గణపతి

గణపతి నవరాత్రోత్సవాలు బుధవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో గణనాథుడు మండపాలకు తరలుతున్నాయి. చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల్లో మండప నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో విగ్రహాలను తరలిస్తున్నారు. ఈస్ట్ జోన్ పరిధిలో చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు ఆరువందల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. ఇప్పటికే ఆయా మండపాల నిర్వాహకులతో పోలీసులు సమావేశాలను ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలను సూచించారు.



మట్టి గణపతుల పంపిణీ

పికెట్‌లోని భూలక్ష్మమ్మ ఆలయ ప్రాంగణంలో 27న జరిగే వినాయక పర్వదినాన్ని పురస్కరించుకుని సామాజిక కార్యకర్త జెట్టి ఏమేశ్వరరావు 250 మట్టి గణపతులను భక్తులకు ఆది, సోమవారాల్లో అందజేశారు.

- మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



గణపతికి వస్త్రాల తయారీ

సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో నవరాత్రుల్లో స్వామివారికి అలంకరించే వస్త్రాల తయారీని సోమవారం ప్రారంభించారు. అనంతరం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఆలయ ఈవో రామకృష్ణారావు ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్, ధర్మకర్తల మండలి సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి

నవరాత్రోత్సవాలు సవ్యంగా జరిగేలా సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రోత్సవాలు సవ్యంగా జరిగేలా అధికారులు సహకరించాలని ఈస్ట్ జోన్ చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి కోరారు. సోమవారం బౌద్ధనగర్ ఏసీపీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణేష్ మండపాల ఏర్పాటు సందర్భంలో అధికారులు మండప నిర్వాహకులకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, అనుదీప్, రఘుబాబు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈలు రోచిత, సునీల్, హార్టికల్చర్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోండా డివిజన్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామి నిలపడంతో పాటు ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం డివిజన్‌లోని రెజిమెంటల్‌బజార్‌లో కోటి ఏడు లక్షల యాభైవేల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోండా డివిజన్‌కు సిమెంట్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రెండు కోట్ల డెబ్బై లక్షల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. గణపతి నవరాత్రులు ముగియగానే వారం రోజులు డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. నంబర్-1 పాఠశాల గేటు వద్ద బస్తీవాసులు చెత్త వేస్తుండటంతో అపరిశుభ్రంగా మారుతుందని, దీనిని నివారించడానికి సర్వేపల్లి రాధాకృష విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని అన్నారు. శనివారం నంబర్-1 స్కూల్‌లో చదువుతున్న 140 మంది విద్యార్థులకు సొంత డబ్బులతో షూస్, బ్యాగులు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే పదో తరగతిలో ఉన్నప్పుడు సైన్స్ బోధించిన నిర్మల టీచర్ అదే స్కూల్‌లో విధులు నిర్వహిస్తుండటంతో అమెను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, కాంగ్రెస్ నాయకులు బాబురావు ముదిరాజ్, అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, బద్రినాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, అజయ్ కుమార్, ప్రభాకర్ యాదవ్, .దనలక్ష్మీ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేయాలి

- జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

బర్కత్‌పుర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. 29న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుని వెంటనే అమలు చేయాలని కోరారు. సోమవారం కాచిగూడ మోతిమార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యేంతా వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు మహాసభ నాయకులు పాల్గొన్నారు.

లలితగీతాల వ్యాప్తికి నవ్యనాటక సమితి పోటీలు దోహదం

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి వారు ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఏవీ సావిత్రి లలితసంగీత పోటీలు లలితసంగీత వ్యాప్తికి దోహదం చేస్తున్నాయని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ఏవీ సావిత్రి లలితసంగీత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానసభ సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి ఆకాశవాణి సంగీత కళాకారిణి ప్రసన్న లక్ష్మిని సత్కరించి మాట్లాడారు. ఆకాశవాణి లలితసంగీత వ్యాప్తికి ఎంతోకృషి చేసిందన్నారు. గానసభలో కళల వికాసానికి 10 లక్షలు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి వసుంధర నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సంగీతగురువు ప్రభాకర్, గాయని సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాకతో ఓయూకు ఒరిగిందేమీ లేదు

- ఆందోళనలో విద్యార్థి సంఘాలు
- నిరసనకారుల అరెస్టు





మాట్లాడుతున్న జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు, ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన భారీ బందోబస్తు మధ్య సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఆయన రాకతో యూనివర్సిటీకి ఒరిగిందేమీ లేదని పలు విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ముఖ్యమంత్రి రాకకు ముందుగానే కొంతమంది నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఎంట్రీ పాసులు ఉన్నా సభా వేదికలోకి అనుమతించకుండా పోలీసులు మీడియా ప్రతినిధులను అడ్డుకుని ఇబ్బంది పెట్టారు. మొత్తానికి ఏర్పాట్లు కల్పనలో యూనివర్సిటీ యంత్రాంగం విఫలమైందని సభకు వచ్చినవారి నుంచి విమర్శలు వచ్చాయి.యూనివర్సిటీ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు అవసరాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నిధులు విడుదల చేయకుండా కమిటీ వేయాలనడం కాలయాపన మాదిరిగా ఉందని, వెంటనే ప్రభుత్వ ఆర్డర్స్ ఇవ్వాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్.నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి డిమాండ్ చేశారు.

పర్యటన ఒక పొలిటికల్ డ్రామా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓయూ పర్యట నను ఒక పొలిటికల్ డ్రామాగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు అభివర్ణించారు. రేవంత్ పర్యటన అనంతరం ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్, సిటీ సెక్రటరీ పృథ్వి తేజ, స్టేట్ జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు మాట్లాడుతూ.. ఓయూ పర్యటనను సీఎం రాజకీయ ప్రసంగానికి వేదికగా చేసుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు ఓరిగిందేమీ లేదన్నారు. 90 శాతం మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుతున్నారని, వాటిని విడుదల చేయకపోవడం వల్ల డ్రాపౌట్స్ పెరుగుతున్నారని, సర్టిఫికెట్ తీసుకోలేక, కొత్త అడ్మిషన్స్ పొందలేక నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ముందస్తు అరెస్టులు

సీఎం రాకను అడ్డుకుంటామని బీఆర్ఎస్‌వీ నాయకులు ప్రకటన చేసిన నేపథ్యంలో కొంత మందిని ముందస్తుగానే పోలీసులు అరెస్టు చేశారు. కొంతమంది సీఎం రాకకు ముందు సీఎం డౌన్.. డౌన్.. అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. వెంటనే అప్రమత్తమయిన పోలీసులు వారిని అడ్డుకుని పీఎస్‌కు తరలించారు.

మీడియాపై ఆంక్షలు..

ఓయూ అధికారులు మీడియా పాసులు ఇవ్వడమే అరకొరగా, బలవంతంగా ఇచ్చారు. అందులోనూ పాసులు చూపించినా మీడియా ప్రతినిధులను లోపలికి అనుమతించకుండా పోలీసులు కొంత ఓవరాక్షన్ చేశారు. సుమారు మూడు కిలోమీటర్ల దూరం కాలినడకన ఠాగూర్ ఆడిటోరియం చేరుకున్న మీడియా ప్రతినిధులకు పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. సీఎం సెక్యూరిటీ నుంచి తమకు ఆదేశాలున్నాయంటూ చివరకు మెయిన్ ఆడిటోరియం వద్ద అనుమతి నిరాకరించడంతో వారు నిరసనకు దిగారు. వీసీ, రిజిస్ట్రార్ ఎవరికి ఫోన్ చేసినా స్పందించలేదు. మరి పాసులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించగా కొంత సేపటికి లోపలికి పంపించారు.



జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను కలిసిన బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య

ప్రజావాణిలో ఫిర్యాదు

అడ్డగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయని, వెంటనే రోడ్లను బాగు చేయాలని కోరుతూ బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య సోమవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని ఏబీసీడీ సెక్షన్లతో పాటు శాంతినగర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలతో ప్రమాదకరంగా మారాయన్నారు. గుంతలు ఉన్న చోట సిమెంట్ ప్యాచ్ వర్క్ చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. జోనల్ కమిషనర్‌ను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు హంసరాజు, రెడ్డప్పలు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

'బెస్ట్ అవలెబుల్' ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

రాంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో బెస్ట్ అవలెబుల్ పథకం కింద చదువుతున్న 25 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.210 కోట్లు వెంటనే విడుదల చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్, ప్రజా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కే రూ.50 వేల కోట్లు ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివలింగం, సైదులు, వేదాంతమౌర్య, రాజేందర్, సంజీవ్, కల్పన, శారద, గోపీ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

దైవభక్తి, దేశభక్తిని పెంపొందిస్తున్న గణేశ్ ఉత్సవాలు

- ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు దైవభక్తి, దేశభక్తిని పెంపొందిస్తున్నాయని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ హాల్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుల, వర్గాలకు అతీతంగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడాలని సూచించారు. ఆనాడు ఉద్యమపోరాటంలో భాగంగా సామూహిక వినాయక మండపాలను ఏర్పాటు చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లారని గుర్తు చేశారు. గణేశ్ మండప నిర్వాహకులకు అధికారులు సహకరించాలని కోరారు. భగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ... భాగ్యనగరంలో లక్షకు పైగా గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతిరోజూ రాత్రి 9గంటలకు వినాయ మండపాల వద్ద సామూహిక దీపారాదన చేయాలని సూచించారు. అనంతరం గణేశ్ నవరాత్రి ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ కన్వీనర్ వినయ్ కుమార్, నియోజకవర్గ ఉత్సవ సమితి నాయకులు శక్తిసింగ్, పరిమళ్‌కుమార్, బుర్రా రాజ్‌కుమార్, ఎం.నవీన్ గౌడ్, ఆయూష్, బిజ్జిరవి, సలంద్రి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.